## క్లుప్తంగా

### ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో బాల వికాస కేంద్రాలు



నడకుదురు సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ధర్మప్రచారక్ రఘు

కరప: ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో ఈ గురుపౌర్ణమి (ఆషాఢమాసం పౌర్ణమి) నుంచి బాలవికాస కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మప్రచారక్ పడాల రఘు తెలిపారు. మండలం నడకుదురులో గురువారం జరిగిన మండల సమరసత సేవా ఫౌండేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల వికాస కేంద్రాలు నిర్వహించేందుకు సింహాచలంలో ఈ నెల ఐదో తేదీ నుంచి 7వ తేదీ వరకు మాతాజీలకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేశామన్నారు. ప్రత్తిపాడులో ఈ నెల 8వ తేదీన కాకినాడ జిల్లా మహిళా సమావేశం ఏర్పాటు చేశామని, సమావేశానికి ప్రతి మండలం నుంచి సమరసత సేవా ఫౌండేషన్ మహిళా కన్వీనర్లు, సహ కన్వీనర్లు పాల్గొనాలని ఆయన కోరారు. గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామ ధార్మిక జట్ల ఆధారంగా వారం వారం భజనలు, సత్సంగాలు, నగర సంకీర్తనలు, పౌర్ణమి హారతులు జరుగుతాయన్నారు. ముందుగా అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఖండ కన్వీనర్ ముమ్మిడి శ్యామ్‌సుందరరావు, మండల కన్వీనర్ ముమ్మిడి పెద్దకాపు, కాలకురస వెంకటరమణ పాల్గొన్నారు.

### పింగళికి ఘన నివాళి



పింగళి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం

కాకినాడ రూరల్: జాతీయ పతాకం రూపశిల్పి పింగళి వెంకయ్య వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఘన నివాళులర్పించింది. సర్పవరం జంక్షన్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో పింగళి చిత్రపటానికి ఆర్మీ విశ్రాంత ఉద్యోగి శ్రీనగేష్, అడబాల రత్నప్రసాద్, కుమార్ యాదవ్, పార్థసారథి, రెడ్నం రాజా, సత్యనారాయణ తదితరులు నివాళులర్పించారు.

### ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి హామీ



ఉద్యోగులతో సమావేశమైన కమిషనర్ వెంకటరావు

కాకినాడ: నగరపాలక సంస్థలో పనిచేసే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కార్పొరేషన్ కమిషనర్ జె.వెంకటరావు చెప్పారు. ఆయన మున్సిపల్ సుపీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు చెప్పిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ వీరికి హామీ ఇచ్చారు.

# ఏలేరు రాక కోసం నిరీక్షణ

- గోదావరి జలాలతో నారుమడులు, వెదజల్లు సాగు
- ఖరీఫ్ పనుల్లో రైతాంగం
- నెలాఖరులోగా నాట్లు పూర్తయ్యేలా సన్నాహాలు



కాకినాడ రూరల్ తూరంగిలో నారుమడి

కాకినాడ రూరల్: సాగుబడిని నమ్ముకుని చమటను చిందించే రైతులు ఈ ఖరీఫ్ సీజనల్‌లో తమ అదృష్టం పరీక్షించుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. ప్రకృతి సహకరించి పంటలు పండాలని, వరుణుడు సకాలంలో వర్షించి పైరు ఏపుగా పెరగాలని, అధిక దిగుబడితో కష్టానికి ప్రతిఫలం దక్కాలని కోరుకుంటూ సేద్యం కోసం సిద్ధమవుతున్నారు. మండలంలో 42 వేల ఎకరాల్లో రైతులు సాగుచేస్తున్నారు. మండలంలో కొన్ని గ్రామాలకు గోదావరి జలాలు వస్తుండగా మరి కొన్ని గ్రామాలు ఏలేరు జలాలపై ఆధారపడి సాగవుతున్నాయి. ఏలేరు కింద తిమ్మాపురం, పండూరు, పి.వెంకటాపురం, తమ్మవరం, పెనుమర్తి, నేమాం తదితర గ్రామాల్లో పొలాలు సాగవుతుండగా



చీడిగలో వెదజల్లు కోసం దమ్ములు చేస్తున్న రైతులు

గోదావరి జిలాలతో సర్పవరం, చీడిగ, రేపూరు, కొవ్వాడ, గంగనాపల్లి, కొవ్వూరు, తూరంగి తదితర గ్రామాలు సాగవుతున్నాయి. ప్రస్తుతం గోదావరి సాగు నీటి జలాలు అందుబాటులో ఉండడంతో రైతులు నారుమడులు వేశారు. వెదజల్లు కోసం



కాకినాడ రూరల్ తిమ్మాపురం వద్ద గుర్రపు డెక్కతో ఏలేరు కాల్వ

దమ్ములు చేస్తున్నారు. జూలై రెండో వారంలో గోదావరి ఆయకట్టు కింద నాట్లు పడే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఏలేరు ఆయకట్టు నుంచి నీరు ఇంకా విడుదల కాలేదు. మరో వైపు ఏలేరు కాల్వలో పూడిక తీత, తొలగింపు, గుర్రపు డెక్క తొలగింపు చేపట్టాల్సి ఉంది. కాకినాడ రూరల్‌లో ఏలేరు కాల్వలకు నీటిని పంపిణీ చేసే కాల్వలు తిమ్మాపురం వద్ద పూర్తిగా గుర్రపు డెక్కతో నిండిపోయింది.

#### స్వర్ణ వైపే రైతుల మొగ్గు

ఈ సీజన్‌లో ఎక్కువ మంది ఎంటీయూ 7029 (స్వర్ణ) రకం వరి వంగడం వైపు ఎక్కువ మంది రైతులు మొగ్గు చూపుతున్నారు. 60 శాతం ఆయకట్టులో స్వర్ణ రకం సాగుకు రైతులు సన్నాహాలు చేస్తుండగా మిగిలిన ఆయకట్టులో పది శాతం బీపీటీ 5204, మరో పది శాతం ఎంటీయూ 1318 రకం, 20 శాతం ప్రైవేట్ వరి వంగడాలు చేయనున్నారు.

#### ఆరోగ్యవంతమైన నారు పెంచడానికి సూచనలు

నారుమడిని 10–12 రోజుల వ్యవధిలో 3 దఫాలు దమ్ము చేసి చదును చేయాలి. నీరు పెట్టడానికి, తీయడానికి కాల్వలు ఏర్పాటు చేసుకోవాలి. ఐదు సెంట్ల నారుమడికి 2 కిలోల నత్రజని (విత్తనం చల్లే ముందు ఒక కిలో, విత్తన 10–15 రోజుల్లో మరో కిలో వేయాలి), కిలో భాస్వరం, కిలో పొటాష్ దుక్కిలో వేయాలి. శుద్ధి చేసిన మొలక కట్టిన విత్తనాన్ని సెంటుకు ఐదు కిలోల చొప్పున వేసుకోవాలి. జింక్ లోపం గమనిస్తే లీటరు నీటికి 2 గ్రాముల జింకు సల్ఫేటు ద్రావణం పిచికారీ చేయాలి. విత్తనానికి పది రోజుల్లో గుళికలు వేయాలి. నారు ఏపుగా ఎదిగిన తరువాత నాట్లు వేయాలి.

#### 10-15 రోజుల్లో నాట్లు



ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. గోదావరి ఆయకట్టు కింద 10–15రోజుల్లో నాట్లు ప్రారంభం కానున్నాయి. ఏలేరు కింద నెలాఖరులోగా వెదజల్లు, నాట్ల ద్వారా రైతులు సాగు చేపట్టనున్నారు. రైతులకు కావల్సిన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాం. వ్యవసాయ శాఖ సహాయకుల ద్వారా రైతులకు సూచనలు ఇస్తున్నాం.

– చీకట్ల సత్యనారాయణ, వ్యవసాయ శాఖ అధికారి, కాకినాడ రూరల్

### వాహనాల మరమ్మతులు వేగవంతం చేయండి



పారిశుధ్య సేవలపై సూచనలిస్తున్న కమిషనర్ వెంకటరావు

కాకినాడ: పారిశుధ్య సేవల కోసం వినియోగించే డంపర్ బిన్లు, పుష్ కార్టులు, ఇతర వాహనాల మరమ్మత్తులను సత్వరమే పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు అధికారును ఆదేశించారు. గురువారం ఆయన బొందగుంటలోని వెహికల్ యార్డ్‌ను సందర్శించారు. వాహనాలను శుభ్రం చేసేందుకు ఏర్పాటు చేసిన ర్యాంపును పరిశీలించారు. వాహనాల పనితీరుపై ఆరా తీశారు. కమిషనర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నేపథ్యంలో మెరుగైన పారిశుధ్య సేవలు అందించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఇందుకోసం పారిశుధ్య సేవలకు వినియోగించే వాహనాలు, ఇతర పరికరాలు పూర్తి కండిషన్‌లో పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఆ మేరకు అంచనాలను రూపొందించి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్, ఈఈ మాధవి, ఏఈ వై.నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

### లక్ష్యాలు పూర్తి చేయాలి

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): నిర్దేశించిన లక్ష్యాలను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని గృహనిర్మాణ శాఖ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ అన్నారు. కాకినాడలోని గృహ నిర్మాణశాఖ కార్యాలయంలో గురువారం ఆశాఖ ఈఈలు, డీఈ, ఏఈలతో సమీక్షించారు. జిల్లాలో 1.2 లక్షల ఇళ్లు మంజూరయ్యాయన్నారు. అవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. వీటిలో త్వరగా పూర్తి చేసేందుకు వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నట్లు చెప్పారు. మొదటి వంద రోజుల్లో 7200 గృహాలు పూర్తి కావాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. గృహ నిర్మాణ లబ్ధిదారులతో మమేకమై గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలన్నారు.

### మాజీ మంత్రి వేణుకు పరామర్శ



సుభద్రమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ మండల నాయకులు

కరప: బీసీ సంక్షేమ శాఖ మాజీ మంత్రి చెల్లుబోయిన వేణును గురువారం మండల వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించి, సంతాపం తెలిపారు. చెల్లుబోయిన మాతృమూర్తి సుభద్రమ్మ ఈ నెల ఒకటిన మృతి చెందడంతో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, కరప, కాకినాడ రూరల్ మండలాల జెడ్పీటీసీ సభ్యులు యాళ్ల సుబ్బారావు, నురికుర్తి రామకృష్ణ (కిట్టు), మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు, మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వాసంశెట్టి శ్రీనుబాబు, చింతా బుజ్జి, మద్దూరి భాస్కర్, కమిడి శంకర్ తదితరులు వేణును పరామర్శించారు.

# నేటి యువతకు ఆదర్శం అల్లూరి

- ఆయన ధైర్య సాహసాలను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ షాన్ మోహన్

కాకినాడ రూరల్: స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు చూపిన ధైర్య సాహసాలు వెలకట్టలేనివి. ఆయన అందించిన స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ పేర్కొన్నారు. గురువారం అల్లూరి జయంతి సందర్భంగా జిల్లా గిరిజన సంక్షేమం, సీతారామరాజు స్మారక కళావేదిక ఆధ్వర్యంలో స్థానిక నాగమల్లితోట జంక్షన్ వద్ద గల అల్లూరి సీతారామరాజు విగ్రహానికి కలెక్టర్ షాన్‌మోహన్, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, కాకినాడ కమిషనర్ జె.వెంకటరావు ఇతర జిల్లా అధికారులతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్ మోహన్ మాట్లాడుతూ గిరిజన ప్రాంత ప్రజలలో స్వాతంత్ర్య కాంక్షను రగిలించడంలో అల్లూరి ప్రముఖ పాత్ర పోషించారన్నారు. భారతదేశంలో బ్రిటిష్ వారు చేస్తున్న దోపిడీపై గిరిజన ప్రజలకు చైతన్యం కలిగించడంలో విశేష కృషి చేసిన సమరయోధుడు అల్లూరి అని కొనియాడారు. గిరిజన ప్రజలు మాత్రమే కాకుండా ప్రతి ఒక్కరు ఆయన ధైర్య సాహసాలను, సేవలను గుర్తుపెట్టుకుని అందరిలో ఆయన స్ఫూర్తిని నింపేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ జేడీ డీవీ రమణమూర్తి, డీటీడబ్ల్యూవో ఎం.విజయశాంతి, పశుసంవర్ధక శాఖ జేడీ ఎస్.సూర్యప్రకాశరావు, బీసీ సంక్షేమ అధికారి ఎం.లల్లి, సెట్రాజ్ సీఈవో ఏవీఎస్ఎన్ మూర్తి, అల్లూరి సీతారామరాజు స్మారక కళా వేదిక ప్రతినిధులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్, ఎమ్మెల్యేలు కొండబాబు, నానాజీ



గురజనాపల్లి హైస్కూలులో అల్లూరి, పింగళి, స్వామి వివేకానంద చిత్రపటాలకు నివాళి



కరప ఎంపీడీఓ కార్యాలయంలో అల్లూరికి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ, సిబ్బంది

#### ఘనంగా అల్లూరి జయంతి

కరప: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ కె.అప్పారావు, సిబ్బంది అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంపీడీఓ అప్పారావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహానుభావులు ప్రాణత్యాగాలు చేశారని, అందులో అల్లూరి పోరాటం నేటి యువతకు ఎంతో స్ఫూర్తి దాయకం అన్నారు. ఏఓ జి.భీమశంకరరావు, వీవీఎస్ వీరేష్, జీవీ చినరాయుడు, టి.సురేష్, రాజేంద్ర పాల్గొన్నారు. గురజనాపల్లిలో పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎ.సాయిమోహన్, స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు, ఉపాధ్యాయులు అల్లూరి సీతారామరాజు జయంతి, జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య, భారతజాతి గొప్పతనాన్ని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

#### యువతకు అల్లూరి ఆదర్శం కావాలి

బోట్‌క్లబ్: నేటి యువత అల్లూరి సీతారామరాజును ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ కాకినాడ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ గట్టి సత్యనారాయణ అన్నారు. అల్లూ జయంతి సందర్భంగా గురువారం బీజేపీ దక్షిణ మండల అధ్యక్షులు చెక్కా రమేష్ ఆధ్వర్యంలో స్థానిక 28వ డివిజన్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్వాత్రంత్య పోరాటంలో ఒక మహోజ్వల శక్తి అల్లూరి అన్నారు. బీజేపీ నాయకులు దొడ్డి వీరేంద్ర, చెల్లూరి సత్యనారాయణ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బీజేపీ నాయకులు

#### తూరంగిలో..

కాకినాడ సిటీ: అల్లూరి సీతారామరాజు జయంతిని తూరంగి అల్లూరి సీతారామరాజు కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ పరిషత్ నాయకులు అడ్డూరి రామకృష్ణంరాజు, వీవీ వర్మ, జె.రమణయ్య రాజు, వి సూర్యనారాయణరాజు, తూరంగి రాజకీయ పార్టీల నాయకులు సీహెచ్ అజయ్‌కుమార్, బొందల చిన్న, కక్కల శ్రీదుర్గ తదితరులు పాల్గొని నివాళులర్పించారు. అల్లూరి త్యాగాన్ని, ధైర్యాన్ని నేటి యువతరం ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

#### పోరాట యోధుడు అల్లూరి

కాకినాడ రూరల్: గొప్ప పోరాట యోధుడు అలూర్లి సీతారామరాజు అని కాకినాడ రూరల్ తహశీల్దార్ విజయ్ ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలో అల్లూరి జయంతిని గురువారం ఘనంగా జరిగాయి. తహశీల్దార్ కార్యాలయంలో అల్లూరి చిత్ర పటానికి తహశీల్దార్ విజయ్ ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి, ఆర్ఐలు నివాళులర్పించారు. రమణయ్యపేట ఏపీఐఐసీ జోనల్ కార్యాలయంలో జెడ్ఎం అబ్బిరెడ్డి రమణారెడ్డి, డీజెడ్ఎం రాధామణి తదితరులు నివాళులర్పించారు. నన్నయ్య ఎంఎస్ఎన్ పీజీ సెంటరులో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పోచయ్య, డాక్టర్ అజయ్ రతన్, నదీమ్ తదితరులు అల్లూరికి నివాళులర్పించారు. సర్పవరం జంక్షన్‌లో వీహెచ్‌పీ కాకినాడ శాఖ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో రవిశంకర్ పటా న్నాయక్, రాణా, అడబాల రత్నప్రసాద్ తదితరులు అల్లూరికి నివాళులర్పించారు. నాగమల్లి జంక్షన్ వద్ద అల్లూరి విగ్రహానికి బీజేపీ నాయకులు రంబాల వెంకటేశ్వరరావు, పితాని లీలావతి, అనపర్తి వెంకటేష్, మూర్తి తదతరులు నివాళులర్పించారు.



అల్లూరి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న తహశీల్దార్ విజయ్ ప్రసాద్, సిబ్బంది

# బుజ్జిగాడికి భలే ఫాలోయింగ్



కాకినాడ ఎస్ఆర్ఎంటీ మాల్ వద్ద కల్కి చిత్రంలోని బుజ్జి వాహనం

కాకినాడ రూరల్: ప్రభాస్ హీరోగా నటించిన కల్కి చిత్రంలో సందడి చేసిన బుజ్జి వాహనం కాకినాడలో గురువారం సందడి చేసింది. సర్పవరం జంక్షన్ వద్ద ఐనాక్స్‌లో కల్కి చిత్రం ప్రదర్శిస్తుండడంతో ఎస్ఆర్ఎంటీ మాల్ వద్ద ప్రజల సందర్శనార్థం ఉదయం నుంచి సాయంత్రం వరకు బుజ్జిని అందుబాటులో ఉంచారు. దానిని చూసేందుకు యువతతో పాటు జనాలు భారీగా తరలిచ్చి సెల్ఫీలు దిగారు.

# ప్రాణహిత మొక్కలు నాటండి

- హానికారక కోనోకార్పస్ చెట్ల తొలగింపుపై కలెక్టర్ సమీక్ష
- ఫ్లెక్సీలు లేని వీధులపై సూచనలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్ మోహన్

కాకినాడ సిటీ: పట్టణంలో పర్యావరణానికి హాని కలిగించే కోనోకార్పస్ చెట్లను తొలగించి వాటి స్థానంలో ప్రాణ వాయువు విడుదల చేసే మొక్కలు నాటేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఆ చెట్ల తొలగింపు, ఫ్లెక్సీలు లేని స్ట్రీట్ వంటి అంశాలపై కలెక్టర్ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్, హార్టికల్చర్, అటవీశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పట్టణ పరిధిలో కోనోకార్పస్ చెట్ల తొలగింపు, వాటి స్థానంలో ఆక్సిజన్ విడుదల చేసే మొక్కలు నాటడం, ఫ్లెక్సీలు లేని స్ట్రీట్‌లను తీర్చదిద్దేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఆయన అధికారులతో చర్చించారు. పట్టణ పరిధిలో సుమారు 4,602 కోనకార్పస్ చెట్లు గుర్తించినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. తొలిదశలో పట్టణ పార్కుల్లో ఉన్న చెట్లు తొలగించాలని ఆదేశించారు. జిల్లా అటవీశాఖ అధికారులను సమన్వయం చేసుకుని తొలగించిన చెట్ల స్థానంలో వెంటనే ఆక్సిజన్ విడుదల చేసే మొక్కలు నాటేందుకు ప్రణాళిక ప్రకారం పని చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే ఏ వీధిలో చూసినా ఫ్లెక్సీలే కనిపిస్తున్నాయని, తౌలుత భానుగుడి జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు ఉన్న ఫ్లెక్సీలు తొలగించాలని, ముందుగా వాటిని ఏర్పాటు చేసిన వారికి సమాచారం ఇచ్చి సోమవారం వరకు తొలగించేందుకు అవకాశం ఇవ్వాలన్నారు. ఆలోగా తొలగించకపోతే మంగళవారం జూలై 9న అధికారులే తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో కాకినాడ కమిషనర్ జె.వెంకటరావు, టౌన్ ప్లానింగ్ అధికారి కె.హరిదాస్, హార్టికల్చర్ ఏడీ టీవీ శిరిల్, కాకినాడ సోషల్ ఫారెస్ట్ ఎఫ్ఆర్వో బి.పద్మజ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బడుగు జీవుల ఆశాజ్యోతి వంగవీటికి నివాళి



రంగా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కాకినాడ సిటీ: దివంగత కాపు ఉద్యమనేత వంగవీటి మోహన్ రంగా 77వ జయంతి వేడుకలను వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వంగవీటి మోహన్‌రంగా చిత్రపటానికి ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా మాజీ చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ఏఎంజీ మాజీ చైర్మన్ వసుపులేటి వెంకటలక్ష్మి, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, మాజీ డైరెక్టర్లు వాసుపల్లి కృష్ణ, పంతం శ్రీనివాస్, కర్రి అనంతలక్ష్మి తదితరులు నివాళులర్పించారు.

#### రంగా మిత్ర మండలి ఆధ్వర్యంలో..

కాకినాడ సిటీ: బడుగుల ఆశాజ్యోతి వంగవీటి మోహనరంగా అని రంగా మిత్రమండలి నాయకులు దామలంక పళ్లంరాజు అన్నారు. గురువారం కాకినాడ రూరల్ మండలం కొవ్వూరు గ్రామ సచివాలయం జంక్షన్ వద్ద రంగా జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో రంగా మిత్రమండలి సభ్యులు పెండెం వెంకటేష్, దావలంక వెంకటేశ్వరరావు, గొల్లపల్లి క్రాంతి, రాజా తదితరులు పాల్గొన్నారు.

#### ప్రజల కోసమే పుట్టిన నాయకుడు రంగా

బోట్‌క్లబ్: ప్రజల కోసమే పుట్టిన వ్యక్తి వంగవీటి మోహనరంగా అని రంగా మిత్రమండలి అధ్యక్షులు ఐవీ రమణ అన్నారు. స్థానిక శారదాదేవి గుడి వద్ద రంగా విగ్రహానికి వారు నివాళులు అర్పించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపుల కోసం ఎన్నో పోరాటాలు చేశారన్నారు. కాప్స్‌రాక్స్ సభ్యుడు ఉలిసి మల్లిబాబు, రంగా మిత్రమండలి సభ్యులు పాల్గొన్నారు.



రంగా విగ్రహానికి పూలమాలలు వేస్తున్న రమణ